క్లుప్తంగా

ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండంనాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు అంబటి రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కాటసాని స్థానిక స్వగృహంలో వారు కలిసి తమకు పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు తనయుడు కాటసాని ఓబులరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి పూలమాలతో సన్మానించారు.

పాఠశాలలకు చేరిన ట్యాబ్‌లు



హెచ్‌ఎంకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈఓ

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఎనిమిదవ తరగతి విద్యార్థుల కోసం మంజూరు చేసిన ట్యాబ్‌లు పాఠశాలలకు చేరాయి. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ అబ్దుల్ కలాం ట్యాబ్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మొత్తం 507 ట్యాబ్‌లు వచ్చాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని గురువారం విద్యార్థులకు ట్యాబ్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: స్థానిక జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు జాతీయ స్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతోమాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో 16వ జూనియర్స్ సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు పాఠశాలకు చెందిన గణేష్‌రెడ్డి, మహీధర్‌రెడ్డిలు ఎంపికై నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ సవిత్‌నాథ్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వర రెడ్డి, పార్వతి, సురేష్, శృతి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.


23న ముక్కోటి ఏకాదశి పూజలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మండలంలోని ఆవులదొడ్డి గ్రామ సమీప కొండల్లో కొలువైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23న శనివారం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, న్యాయవాది ఆలా మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణంలో బుధవారం ముక్కోటి ఏకాదశికి సబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్ : పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న హోసన్నా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు విజయ సోర్ట్స్ యజమాని తిరువీధి సురేష్ కుటంబ సభ్యులతో కలిసి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత కుటంబ సభ్యులు జగదీష్, వసంత్, స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, ఆశ్రమ మేనేజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌కొత్తపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల ప్రజలకు బుధవారం 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలపై మాస్టర్ ట్రైనర్ దేవదాసు అవగాహన కల్పించారు. ప్రత్యక్షంగా ఓటువేసే విధానం తీరును ఆయన ప్రజలకు వివరించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఓ మహిళ కుటుంబానికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని ఐదవ సచివాలయంలో పరిధిలోని ఎస్టీకాలనీ, గొల్లపేట, చాకలి పేట, కొలిమిపేట తదితర కాలనీల్లో బుధవారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భానుముక్కలలోని పెద్దమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లో తెలిపిన వివరాల మేరకు ప్రభుత్వం ప్రభుత్వ పథకాలు వర్తించాయా.. లేదా అని లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరా తీశారు. అన్ని పథకాలు వర్తించాయని లబ్ధిదారులు సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన తేడాలని గుర్తించాలని ప్రజలను కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకే తీసుకురావడం జరిగిందన్నారు. గత టీడీపీలో రేషన్‌కార్డు, గృహాలతో పాటు కుల ఆదాయ, ధ్రువపత్రాలతో సహా ఏది కావాలన్నా ఆయా కార్యాలయాలకు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడేవారని, నేడు ఆ పరిస్థితిలేదన్నారు. వలంటీర్లు స్వయంగా మీ ఇంటి వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలతో పాటు వివిధ రకాల సర్టిఫికెట్లను కూడా ఇప్పించారని గుర్తు చేశారు. అర్హత ఉంటే చాలు... పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రతి కుంటుబానికి మేలు చేసిన.. చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలువాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఎంఈఓ స్వరూప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, భానుముక్కల సహకారం సంఘం చైర్మన్ నీలిశ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, అబ్దుల్‌తహీర్, వార్డు సభ్యులు జీటీ వెంకట్రామిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కూరగాయాల రహీమాన్, సునార్ ఇక్బాల్, అబ్బాస్, ముర్తుజా, సాబ్జాన్, రఫీ, అలీ అబ్బాస్, చాంద్‌బాషా, శివవరం మధు, కె శ్రీనివాసులు, బాలు, సజ్జాద్, గొల్ల నాగరాజు, మనోహర్, కె.దుర్గ,తెలుగు నాగేంద్ర, అంజీ, సాదక్, శ్రీరాములు, చాకలి ప్రసాద్, చాకలి వెంకటరమణ, గొల్లశేషు, బాలుడు, మధుసూదన్, సోహెల్, బోయపేటనవీణ్, యూనుస్, సురేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో ఒకరు మృతి చెందితేనే మరొకరికి పింఛన్ మంజూరయ్యే పరిస్థితి !

గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు పేదల సమస్యలను చాలా నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. తాము పేదల వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక అడ్డుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. టీడీపీ హయాంలో ప్రత్యేకించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఏళ్ల తరబడి జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఒకరు చనిపోతే తప్పా ఇంకొకరికి పింఛన్ మంజూరయ్యేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఏ మాత్రం లేదన్నారు. ఎవ్వరి చుట్టూ తిరగాల్సిన అవసరం అస్సలు లేదని, అర్హత ఉంటే మీ ఇంటి ముంగిటకే పింఛన్ వస్తుందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు.

భగవంతుని నామస్మరణతో మోక్షం

బేతంచెర్ల: భగవంతుని నామస్మరణంతో మోక్షం కల్గుతుందని స్వామిజీలు పాండు రంగ భారతి, శ్రీ రుక్మిణి మాతాజీ, శ్రీ అనంతనంద భారతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం బేతంచెర్లలో సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి హిందూ ధర్మ సమ్మేళన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారిశాలలో కోలాటం, చెక్క భజన, అయ్యప్ప భజనలు నిర్వహించారు. కార్యక్రమంలోసమరసత సేవాఫౌండేషన్ నంద్యాల జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, సహకన్వీనర్ నాగమోహన్, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బాలీశ్వర్‌రెడి,పట్టణ, మండల కన్వీనర్లు రాజేష్, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో బ్రిడ్జి కోర్సుకు శిక్షణ

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో డిప్లమో పాలిటెక్నిక్‌లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోరకు నిర్వహించే అర్హత పరీక్ష (బ్రిడ్జి కోర్సు) శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్, కన్వీనర్ ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ చదివి 60శాతం మార్కులతో పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లమో ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ఈ అర్హత పరీక్ష పాసు కావాల్సి ఉంటుందన్నారు. ఈ కోర్సుకు జనవరి 2వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి అభ్యర్థులు వారి సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 2 పాస్ ఫొటోలతో ఐటీఐలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి



ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ, అధికారులు

కోవెలకుంట్ల: గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పాటుపడాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. 18 సంవత్సరాల్లోపు బడి బయటి పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, వ్యవసాయ, గృహ నిర్మాణ, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతి పథం, రోడ్డు రవాణా, అటవీ, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు సంబంధించి జరిగిన అభివృద్ధిపై చర్చ సాగింది. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కోఆప్షన్ మెంబర్ దిల్కాబాషా, ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్‌డీ రాధిక, పంచాయతీ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చెంచయ్య, రామమోహన్, హరీష్, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కొలిమిగుండ్ల: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీ ప్రారంభమైందని ఏపీఓ గంగన్న తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు ఉపాధి పథకం కింద పారంఫండ్స్, కందిత కందకాలతోపాటు పలు పనులు జరిగాయన్నారు. రూ.4.55 కోట్లు కూలీలకు వేతనాల కోసం, రూ.5.30 కోట్లు మెటిరీయల్ కోసం ఖర్చు జరిగిందన్నారు. వీటిపై గ్రామాల్లో డీఆర్‌పీ సభ్యులు విచారణ చేస్తున్నారన్నారు. జనవరి 5న మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చెప్పారు.

కరువు గ్రామాలుగా ప్రకటించి ఆదుకోవాలి

బనగానపల్లె : అవుకు మండల పరిధిలోని కొండమనాయునిపల్లె జునుంతల ఉప్పలపాడు కునుకుంట్ల, మరికుంట తండా, మారేమడుగుల, పికిళ్లిపల్లె తండా, మన్నేనాయక్ తండా, ఇస్రానాయక్‌తండా, మంగంపేట మంగంపేట తండాలను కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని కోరుతూ బుధవారం స్థానికి స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆయా పల్లెల రైతులు వినతి పత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా తీవ్రంగా పంట నష్టం జరిగిందని, ఆదుకోవాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జునుంతల భాస్కర్‌రెడ్డి, కొండమనాయునిపల్లె నారాయణరెడ్డి, ఎల్లాల శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఉప్పలపాడు సర్పంచ్ వెంకటేశ్వరు, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పకడ్బందీగా పూర్తి చేయాలి



సుందర్‌సింగ్ కాలనీలో దరఖాస్తు అందించిన ఓటర్లను విచారిస్తున్న మురళీధర్‌రెడ్డి

- ఎలక్ట్రోల్ రూల్ అధికారి మురళీధర్ రెడ్డి

డోన్ టౌన్ : ఓటర్ల జాబితాను పకడ్బందీగా తప్పులు లేకుండా త్వరిగ గతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ఎలక్ట్రోల్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన డోన్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. తొలగింపు కోసం వచ్చిన ఓటర్ల దరఖాస్తులను పరిశీలించిన ఆయన ఏటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికారులను వివరాలు అడిగారు. అనంతరం సుందర్‌సింగ్‌కాలనీలో చనిపోయిన వ్యక్తి ఓటు తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తుదారుడికి ఇంటికి ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో ఆయన కలిసి వెళ్లి ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, వీఆర్వోలు రామకృష్ణారెడ్డి, రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కర్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రెండవ గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అడవులు అంతరించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అలాగే గురువారం దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, చేతికర్రలు, తదితర యంత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు కర్రా తేజవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సహదేవరెడ్డి, ఈఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



మహిళకు హెల్త్ కార్డు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ప్రభుత్వాసుపత్రులను కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దడంతో ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.5లక్షల నుండి రూ.25లక్షల వరకు పెంచిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ గుర్తు చేశారు. స్థానిక రెండవ సచివాలయంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను ప్రజలకు జిల్లా మెడికల్ అధికారి చెన్నకేశవులు, స్థానిక మెడికల్ అధికారి మహర్షి కలిసి చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ దైనందిక జీవితంలో విద్య, వైద్యానికి ప్రజలు అత్యధిక మొత్తంలో డబ్బును వ్యయం చేయాల్సి వస్తోందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలందరికీ విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే దృఢసంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్‌లు ఫాతిమా, రాజేశ్వరి, హెల్త్ కార్యదర్శులు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌కు స్థలం కేటాయించాలి

డోన్ టౌన్ : గిరిజన భవన నిర్మాణం కోసం పట్టణ సమీపంలోని 510 సర్వే నెంబర్‌లోని అటవీశాఖ భూమిలో 2.5ఎకరాల భూమి కేటాయించాలని ఎస్‌టీ ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, జిల్లా కార్యదర్శి వెంకటేశు, ఏపీ ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మేడసారి గోపాల్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ విద్యా సాగర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి డోన్ అధ్యక్షుడు చౌటా రామయ్య, నాయకులు గుండాల రాముడు,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రాముని చిత్ర పటం, అక్షింతలు

డోన్ టౌన్ : అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి డోన్‌కు వచ్చిన అక్షింతలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ అందజేస్తామని విశ్వ హిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి రామ రాజేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 22వ తేదీన ఉదయం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతలను ప్రతి గ్రామానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 1 నుంచి అయోధ్య రాముల చిత్రపటం, అంక్షితలు ప్రతి ఇంటికి అందజేస్తామని తెలిపారు. ప్రఖండ ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, రూప్లానాయక్, జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలి

బేతంచెర్ల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పరిధిలో ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సమర్థవంతగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంగన్న, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వ్యాయమ ఉపాధ్యాయులతో క్రీడా పోటీల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 4990 మంది యువతి, యువకులు క్రీడా పోటీలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

నివాళి

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో బుధవారం సీపీఐ నాయకుడు పెద్దయ్య వర్ధంతిని నాయకులు నిర్వహించారు. ఆయన స్థూపానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి పులిశేఖర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోక్సో కేసు నమోదు

డోన్ రూరల్ : మండల పరిధిలోని వెంకటరాముడిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ బాలికపై వెంకటరాముడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక బంధువులు ఫిర్యాదు మేరకు అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

డీలర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట డీలర్ పాలకొల్లు శేఖర్‌ను ట్రాక్టర్ ఢీ కొనడంతో ఈనెల 12వ తేదీన మృతి చెందాడు. మృతుడు పాలకొల్లు శేఖర్ కుమార్తె భవితకు డీలర్ పోస్టు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ మండల డీలర్ల అసోసియేషన్ సభ్యులు మురళయ్య, మనోహర్, ఫణిసాయి, అనిఫ్, సుబ్బరాయుడు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకట రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలకు స్థలాల పరిశీలన

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి బుధవారం ఎంపీడీఓ సాయికృష్ణ వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలతో కలిసి స్థలాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తి కావడంతో ఈనెల 26నుంచి మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో పోటీలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు అనుగుణంగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దుతున్నామన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

డోన్ టౌన్ : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ బీజేపీ, మహిళా మోర్చా నాయకులు బుధవారం నిరసన తెలిపారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.


వేతన సవరణ చర్యలు చేపట్టాలి

డోన్ టౌన్ : ఎల్ఐసీ యజమాన్యం వేతన సవరణ చేపట్టేందుకు యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని ఉద్యోగుల,సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ కమిటీ నాయకులు ఉస్మాన్‌గని, కిరణ్‌కుమార్, నరహరి, కరుణాకర్ కోరారు. ఈ మేరకు స్థానిక కార్యాలయం వద్ద బుధవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ప్రకాష్, హిదయతుల్లా, వీరన్న పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణలను అరికట్టాలి

డోన్ టౌన్ : పట్టణ శివార్లలోని కెయి కృష్ణమూర్తి నగర్‌లో ఉన్న ప్రధాన కాలువను కొందరు అక్రమిస్తున్నారని, అరికట్టాలని కాలనీవాసులు మాధవ స్వామి, మద్దిలేటి, నాగరాజు, లక్ష్మీదేవి, మద్దమ్మ తదితరులు కోరారు. కాలువ సమీపంలో వెంచర్ వేసి ఆక్రమిస్తున్నారని, వర్షాకాలంలో నీరు కాలనీలోకి వచ్చే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించి న్యాయం చేయాలని కాలనీ వాసులు కోరారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్ : నంద్యాల పట్టణంలో మూడు రోజులు కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఈద్గా నగర్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ ఇంటికి బుధవారం కాటసాని వెళ్లి కుటుంబ సభ్యులు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను బాధిత కుటుంబ సభ్యులకు కాటసాని ఓబులరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కంబగిరి, మాబాషా, గౌండసుబ్బయ్య, నవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.3.5లక్షలు విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి శీలం తిమ్మయ్య, అంజనమ్మ కుమారులు భాస్కర్ నాయుడు బ్రదర్స్ రూ.3.5లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు బుధవారం మణికంఠ బృందం కమిటీ సభ్యులు, ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్రకాష్, వెంకటేష్, సతీష్‌కు దాతలు నగదు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

క్రైం కార్నర్


కోలుకోలేక వ్యక్తి మృతి

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటకు చెందిన రాముడు (42) కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉడుములపాడు గ్రామం జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ నెల 18న జరిగిన ప్రమాదంలో రాముడు గాయపడ్డాడన్నారు. బైకుపై కర్నూలు వైపు నుండి డోన్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాముడు తీవ్రంగా గాయపడగా ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తరలించిన విషయం తెలిసిందే. మృతుని సోదరుడు రామచంద్రుడు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

డోన్ రూరల్: తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లా, అట్టాకుల మండలం, కనుమూరు గ్రామానికి చెందిన సత్తెన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్ పోలీసులు తెలిపారు.మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కుమారుడు అప్పటికే అట్టాకుల మండలంలోని పోలీస్ స్టేషన్‌లో తన తండ్రి సత్తెన్న కనబడుటలేదని, మస్తిమితం సరిగా లేదని ఫిర్యాదు చేశారన్నారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

వైద్య రంగానికి పెద్దపీట



పసుపల గ్రామంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్‌పాలనలో వైద్య, విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పసుపల గ్రామంలో సర్పంచ్ మోహన్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏపీకి సీఎం జగన్ ఎందుకుకావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్వరమ్మ, గుండం మల్లీకార్జున స్వామి ఆలయ చైర్మన్ రాజేశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగశేఖర్ నాగరాజు, పాపన్న, ఈశ్వర్ నాయక్, సోమ్లానాయక్, ఎం పెద్దిరెడ్డి, రామస్వామి జయరాముడు రామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు



కమ్యూనిటీ హాలు మూల స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ముదిగేడు రస్తాలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయి. రెండు నెలల క్రితం నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేష్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి మూలస్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, కాంట్రాక్టర్, వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రా తేజవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అక్బర్‌బాష, సహదేవరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య పాల్గొన్నారు.